క్లుప్తంగా

పీఆర్ ఈఈ బాధ్యతల స్వీకరణ



మహేశ్వరరెడ్డిని అభినందిస్తున్న పీఆర్ డీఈఈ, ఏఈలు

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం కర్నూలు ఇన్‌చార్జ్ ఈఈగా ఎస్ మహేశ్వరరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ రెగ్యులర్ ఈఈగా విధులు నిర్వహించిన ఎస్ఈసీ మద్దన్న వైఎస్సార్ కడప జిల్లా పీఆర్ ఎస్ఈగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలోనే కర్నూలు పీఐయూ డీఈఈగా విధులు నిర్వహిస్తున్న మహేశ్వరరెడ్డికి ఇన్‌చార్జీ ఈఈగా బాధ్యతలు అప్పగిస్తూ పీఆర్ ఈఎన్‌సీ బాలునాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈఈగా బాధ్యతలు స్వీకరించిన మహేశ్వరరెడ్డికి పీఆర్ క్వాలిటీ కంట్రోల్ డీఈఈ వీ రవీంద్రారెడ్డి, పీఏ టు ఎస్ఈ బండారు శ్రీనివాసులు, డీఈఈలు శేష య్య, రమేష్‌కుమార్‌రెడ్డి, ఏఈలు విజయభాస్కర్, ప్రకాష్, వెంకటేశ్వర్లు, అమర్‌నాథ్ తదితరులు బొకేలు అందించి అభినందనలు తెలిపారు.

ఆంత్రాక్స్ తప్పుగా నమోదైంది

కర్నూలు (హాస్పిటల్): ఆంత్రాక్స్ వ్యాధి కేసులు ఉన్నట్లు ఐహెచ్‌ఐపీ పోర్టల్‌లో తప్పుగా నమోదైందని, వాటిని తొలగించాలని వైద్య ఆరోగ్య శాఖకు లేఖ రాసినట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆసుపత్రిలో రిపోర్టింగ్ సౌకర్యం కోసం ఉన్న ఐహెచ్‌ఐపీ పోర్టల్ (పి ఫారం)లో కొన్ని ఆంత్రాక్స్ కేసులు తప్పుగా నివేదించిన విషయం తన దృష్టికి వచ్చాయన్నారు. ఆసుపత్రి రికార్డులు పరిశీలించిన అనంతరం ఇటీవల ఎలాంటి ఆంత్రాక్స్ కేసులు నమోదు కాలేదని నిర్ధారించామన్నారు. తప్పుగా నమోదైన ఆంత్రాక్స్ కేసులను ఐహెచ్‌ఐపీ పోర్టల్‌లో తొలగించాలని డీఎంహెచ్‌ఓను కోరారు.

డాక్టర్‌కు సన్మానం



డాక్టర్ రూతు లావణ్య దంపతులను సన్మానిస్తున్న అధికారులు, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలోని బయోకెమిస్ట్రీ విభాగంలో ప్రొఫెసర్, హెచ్‌ఓడీగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన డాక్టర్ రూతు లావణ్యను కళాశాల, ఆసుపత్రి అధికారులు, వైద్యులు ఘనంగా సన్మానించారు. శనివారం కళాశాలలోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడారు. డాక్టర్ రూతు లావణ్య బయోకెమిస్ట్రీ విభాగానికి అందించిన సేవలను కొనియాడారు. ఆమె వల్ల ఎంతో మంది విద్యార్థులు నేడు ఉన్నత స్థానంలో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ జీడీఏ ప్రెసిడెంట్ డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్, ప్రాంతీయ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు, ప్రభుత్వ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, వైస్ ప్రిన్సిపల్‌లు డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ సింధియా శుభప్రద, వైద్యులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న సీజేఐ జడ్జి శోభారాణి

కర్నూలు (సిటీ): స్థానిక కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.వెంకటరెడ్డి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కర్నూలు సీజేఐ జిల్లా జడ్జి శోభారాణి మాట్లాడుతూ.. లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం, మాదక ద్రవ్యాల నిరోధక చట్టం, పీసీఆర్ చట్టం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్, ర్యాగింగ్ చట్టంపై అవగాహన కల్పించారు. లీగల్ సర్వీసెస్ యూనిట్ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.వి.రంగారెడ్డి, కన్వీనర్ ఎస్సీ/ఎస్టీ సెల్ డాక్టర్ ఎస్.శైలజ, తెలుగు లెక్చరర్ జయ సుశీల, కల్పన, విద్యార్థులు పాల్గొన్నారు.

పండ్ల తోటల అభివృద్ధికి చర్యలు చేపట్టండి

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య ఏపీడీలు, ఏపీవోలను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని డ్వామా సమావేశ మందిరంలో ఏపీడీలు, ఏపీవోలు, ఈసీలు తదితరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రాధాన్యత అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాలు పడుతున్నందున మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తెలిపారు. 2014 నుంచి 2019 వరకు మెటీరియల్ కాంపోనెంటు కింద చేపట్టిన పనులకు సంబంధించి 10 శాతం అమౌంటులో విత్‌హెల్డ్‌లో పెట్టి పనులను క్లోజ్ చేశారన్నారు. ఈ పనులను మళ్లీ ఓపెన్ అయినందున విత్‌హెల్డ్‌లో ఉన్న మొత్తం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు పీడీ మాధవీలత, ఏపీడీలు పాల్గొన్నారు.

మహా గణపతిం.. మనసా స్మరామి!



గాలీగేరిలో.. ఆపరేషన్ సింధూర్



బంగారు పేటలో.. నాద స్వరూపుడు



అబ్బాస్ నగర్‌లో.. చిన్నికృష్ణుడిగా..



శ్రీనివాస నగర్‌లో.. లంబోదరుడు



స్కందా హైబిస్కస్‌లో.. అభయమిస్తూ



లలితా పీఠంలో.. శేషవాహనంపై..



గాలీగేరిలో.. విఘ్న నాయకుడు

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు కనుల పండుగలా సాగుతున్నాయి. కర్నూలు నగరంలో నాలుగో రోజు శనివారం వినాయకుని ఆలయాలతో పాటు గణనాథుని మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు వినాయక మండపాలకు వెళ్లి గణనాథులను దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. మండ పాల వద్ద హోమాలు, అర్చనలు, సామూహిక కుంకుమార్చనలు, విష్ణు, లలితా సహస్ర పారాయణాలు, భజనలు, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండపాల నిర్వాహకులు పిల్లలు, మహిళలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. కొత్తపేట శ్రీబాల గణేష్ భక్త బృందం యూత్, బాలాజీ నగర్ సాయిబాబా ఆలయం యూత్ వారు ఏర్పాటు చేసిన వినాయకునికి నిర్వహించిన పూజల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, కర్నూలు నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఎస్వీ మోహన్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి పాల్గొని అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ పార్టీ నేతలతో కలసి వినాయక మండపాలను సందర్శించి భక్తులకు అన్నదానం చేశారు. శ్రీ గణేష్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. మండపాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

– కర్నూలు కల్చరల్



అన్నదానం చేస్తున్న ఎస్వీ మోహన్ రెడ్డి దంపతులు



అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



ధర్మ పేట ఎస్వీ ప్రైడ్‌లో..

గణేశుడి ఆశీస్సులు అందరికీ ఉండాలి



పాత్రికేయ గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసుకుంటున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): జిల్లా ప్రజలకు గణనాథుడి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. శనివారం సమాచార శాఖ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయ గణపతిని జిల్లా కలెక్టర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గణనాథుడి ఆశీర్వాదంతో ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. అనంతరం పాత్రికేయ ఉత్సవ గణపతి సమితి సభ్యులు కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు కె.జయమ్మ పాల్గొన్నారు. రాత్రి ఏడు గంటల సమయంలో జాయింట్ కలెక్టర్ జేసీ నవ్య పాత్రికేయ వినాయకుడిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు.

పూజల్లో మాజీ ఎమ్మెల్యే

కర్నూలు (టౌన్): నగరంలోని బాలాజీనగర్, బుధవారపేటల్లో పార్టీ శ్రేణులు ప్రతిష్టించిన వినాయక విగ్రహాల మండపాలను శనివారం సాయంత్రం కర్నూలు మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ సందర్శించారు. దర్బంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కర్నూలులో కులమతాలకతీతంగా అన్ని పండుగలు హిందూ, ముస్లింలు కలిసి మెలిసి జరుపుకుంటారన్నారు. వైఎస్సార్‌సీపీ మహిళ నాయకులు మంజులతారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో డ్రగ్స్‌ను పారద్రోలుదాం

- ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ



'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ

కర్నూలు: సమష్టి కృషితో డ్రగ్స్‌ను పారద్రోలుదాం అని ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ పిలుపునిచ్చారు. దూపాడు దగ్గర ఉన్న అశోక ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 'డ్రగ్స్ వద్దు బ్రో...' అనే కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆకె రవికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డ్రగ్స్ వద్దు బ్రో.. అనే పేరుతో పోస్టర్‌ను విడుదల చేశారు. డ్రగ్స్ మిమ్మల్నే కాదు... మీ కుటుంబాలను నాశనం చేస్తుంది.. బాల్యాన్ని బలి తీసుకుంటున్న డ్రగ్స్ మత్తులో పిల్లలపై అఘాయిత్యాలు, డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కుంటున్న విద్యార్థులు అనే పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని, గంజాయిని కట్టడి చేయడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఈగల్ పేరుతో యాంటీ డ్రగ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా గంజాయి సాగు, డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం గురించి సమాచారం ఉంటే టోల్‌ఫ్రీ నెంబర్ 1972కు అందించాలన్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ డ్రగ్స్ రమాదేవి, అశోక గ్రూప్స్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ సీఈఓ డాక్టర్ హరికృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ ఆర్.నవీన్, ఈగల్ టీమ్ సీఐ ప్రసాద్, ఎస్ఐ సుజన్ కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎన్‌ఈపీకి అనుగుణంగా పాఠ్య ప్రణాళికలు



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ పీఎస్ షావలి ఖాన్

కర్నూలు కల్చరల్: జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా పాఠ్య ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీఎస్ షావలిఖాన్ అన్నారు. శనివారం వర్సిటీలో హైబ్రిడ్ (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్) విధానంలో జరిగిన బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బీవోఎస్) సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జాతీయ విద్యా విధానం 2020కు అనుగుణంగా పాఠ్య ప్రణాళికల తయారీలో యూజీసీ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి మార్గదర్శకాలకు అనుగుణంగా వివిధ సబ్జెక్టుల్లో పాఠ్య ప్రణాళికలను రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ, యూజీసీ నెట్ సిలబస్‌లను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. సిలబస్ విద్యార్థులకు జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో పాటు స్వయం ఉపాధి కల్పనకు అవకాశం ఉండాలన్నారు. అలాగే యూనివర్సిటీ రూపొందించిన పాఠ్యప్రణాళికలను రాష్ట్ర ఉర్దూ అకాడమీ సహకారంతో ఉర్దూ మాధ్యమంలో అనువదించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ, వివిధ శాఖల బోర్డ్ ఆఫ్‌స్టడీస్ చైర్మన్‌లు సభ్యులు, ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మహబుబ్ బాషా, టీచింగ్ ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

బాబు పాలనలో పనిభారం



వర్కుషాపులో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించక పోగా యాప్‌లతో పనిభారం మోపుతుందని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ విమర్శించారు. కార్మిక, కర్షక భవన్‌లో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి.రేణుక అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వర్కుషాపునకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో 42 రోజుల సమ్మె చేస్తున్న సమయంలో కూటమి నేతలు తమ దగ్గరకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా ఒక్క సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పి.నిర్మల, వెంకటమ్మ, పీఎస్ రాధాకృష్ణ, పాల్గొన్నారు.

నేత్రదానానికి ముందుకు రావాలి



విద్యార్థులకు నేత్రదాన అంగీకార పత్రాలు అందించిన అధికారులు

కర్నూలు(హాస్పిటల్): విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారిణి డాక్టర్ సంధ్యారెడ్డి చెప్పారు. శనివారం స్థానిక బి.క్యాంపులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్యారెడ్డి మాట్లాడుతూ.. పుట్టిన ప్రతి వ్యక్తి చనిపోయిన తర్వాత ఎవ్వరైనా నేత్రదానం చేయవచ్చన్నారు. దీని వల్ల మరో ఇద్దరికి చూపును ప్రసాదించిన వారవుతారన్నారు. ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో నేత్రనిధిని సైతం ఏర్పాటు చేశామని, చనిపోయిన వెంటనే ఆరు గంటల్లోపు 9849903116, 9640692299కు ఫోన్ చేస్తే టెక్నీషియన్లు వచ్చి నేత్రాలను సేకరిస్తారన్నారు. సేకరించిన కళ్ల స్థానంలో కృత్రిమమైన కళ్లను అమరుస్తారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరాశాంతి, అధ్యాపకులు సోమశేఖర్, కౌన్సిలర్ శంకర్, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సీపీఓ పదవీ విరమణ



హిమ ప్రభాకరరాజును సన్మానిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ నవ్య

కర్నూలు(సెంట్రల్): చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న హిమ ప్రభాకరరాజు పదవి విరమణ చేశారు. ఈ మేరకు శనివారం సూరజ్‌గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హిమ ప్రభాకరరాజును కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ నవ్య, ఇతర జిల్లా అధికారులు సన్మానించి వీడ్కోలు పలికారు. ఆయన స్థానంలో ప్రస్తుతం ఏడీగా పనిచేస్తున్న వి.భారతికి సీపీఓ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

కర్నూలు కార్పొరేషన్ మళ్లీ వైఎస్సార్‌సీపీదే

- వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్

కర్నూలు (టౌన్): నగరంలో అన్ని వర్గాలను కలుపుకొని వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేస్తామని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్ అన్నారు. కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్తగా పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, పార్టీ నగర అధ్యక్షులు అహమ్మద్ అలీఖాన్‌ను ప్రకటించడంతో శనివారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా పార్టీ క్యాడర్‌లో నూతనోత్సాహం నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం హామీల అమలులో ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. రైతుల గోడు ఈ ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు పాటిల్ హనుమంత రెడ్డి, అక్కిమి హనుమంత రెడ్డి, కిషన్, రాఘవేంద్ర నాయుడు, లాజర్, గోల్డ్ శీను, బుల్లెట్ అంజి, బబ్లూ, కంటూ, ఏసు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఉస్మానియా విద్యార్థికి కాంస్యం



ఆరిఫ్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ అజ్రా జావీద్

కర్నూలు (టౌన్): జార్ఖండ్ రాష్ట్రంలో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఉస్మానియా కళాశాలకు చెందిన విద్యార్థి ఎస్. ఆరిఫ్ 95 కేజీల బెంచ్ ప్రెస్ విభాగంలో పాల్గొని కాంస్య పతకం సాధించాడు. పతకం సాధించిన విద్యార్థిని శనివారం స్థానిక కళాశాలలో కరస్పాండెంట్ అజ్రా జావీద్, ప్రిన్సిపాల్ సయ్యద్ సమీయుద్దీన్ అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ప్రకాష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత పెద్దారెడ్డి మృతి

కర్నూలు(సెంట్రల్): మాజీ విశ్రాంత అధికారి, కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు, మాజీ ప్రధాన కార్యదర్శి తెర్నేకల్ కె.పెద్దారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం ఉదయం బళ్లారి చౌరస్తా సమీపంలోని ఫోర్ట్ టౌన్ పోలీసు స్టేషన్ వెనుక ఉన్న ఆయన స్వగృహంలో కన్నుమూశారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు రఘునాథ్ టాకీస్ సమీపంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు ఆయన కుటుంబీకులు తెలిపారు.

ఏకధాటిగా ఏక పాత్రాభినయం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, కళాక్షేత్రం సభ్యులు, వివిధ పాత్రలను అభినయిస్తున్న కళాకారులు

- నిర్విరామ పోటీల నిర్వహణలో రికార్డ్
- తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు కానున్న ప్రక్రియ

కర్నూలు కల్చరల్: ఏకధాటిగా ఏక పాత్రాభినయం పోటీలు నిర్వహించటం తెలుగు రంగస్థల చరిత్రలో టీజీవీ కళాక్షేత్రం పేరు నిలిచిపోతోందని పలువురు అతిథులు అభిప్రాయపడ్డారు. తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో భాగంగా సీక్యాంప్ టీ జీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో శనివారం రంగస్థల ఏకపాత్రాభినయం పోటీలను మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, పారిశ్రామిక వేత్త బీవీ రెడ్డి, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, మాంటిస్సోరి విద్యా సంస్థల అధినేత కేవీఎస్ రాజశేఖర్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ చైర్మన్ వెంకటాచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ మాట్లాడుతూ.. తగ్గిపోతున్న రంగస్థలానికి ఆదరణ పెరగాల్సిన అవసరం ఉందన్నారు. మన సంస్కృతి, చరిత్రను ప్రతిబింబించే మహనీయుల వేషధారణలతో వేదికపై అభినయం చేయడం విశేషమన్నారు. వెంకటాచారి మాట్లాడుతూ.. 24 గంటల పాటు నిర్వహిస్తున్న ఏక పాత్రల పోటీలు ఒక రికార్డన్నారు. దీన్ని నమోదు చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. జి.పుల్లయ్య మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు తెలుగు భాషా దినోత్సవం వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. రెండో రోజు 24 గంటల పాటు ఏక పాత్రాభినయం పాత్రల పద్యాలు, పాటలు, డైలాగ్‌ల పరంపర కొనసాగుతుందన్నారు. పోటీల్లో పాల్గొన్న కళాకారులను అతిథులు ఘనంగా సన్మానించారు. పత్తి ఓబులయ్య రచించిన పదవి మూలం ఇదం జగత్ అధి'కారము' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో యాగంటి ఈశ్వర్, సాహితీ సంస్థ నరసం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దండబోయిన పార్వతి, కళాక్షేత్రం ఉపాధ్యక్షులు దాసెట్టి శ్రీనివాసులు, సభ్యులు రాజారత్నం, గాండ్ల లక్ష్మన్న, శ్రీనివాసరెడ్డి, రమణ, శివయ్య, క్రిష్టపర్, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ ఆగ్రహం

- మున్సిపల్ సిబ్బందిపై మండిపాటు

కర్నూలు (టౌన్): 'నగరంలో పారిశుద్ధ్య లోపంపై జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా చెప్పిందే నిజమనిపిస్తోంది. వ్యాపారాలు చేసుకునే చోట ఇంత అధ్వానంగా పారిశుద్ధ్యం ఉంటే ఎలా వ్యాపారాలు చేసుకుంటారు.. మీ పరిసరాలు ఇలాగే ఉంటాయా..? అని పారిశుద్ధ్య అధికారిపై నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్ మండిపడ్డారు. శనివారం స్థానిక పెద్ద మార్కెట్ వద్ద ఉన్న నగరపాలక మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను పారిశుద్ధ్యం, రెవెన్యూ విభాగం సిబ్బందితో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఎటు చూసినా పరిసరాలు కంపుకొడుతుండటంతో పారిశుద్ధ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో అవసరమైన మరమ్మతు పనులు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లను రెవెన్యూ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు.

ఇకనైనా.. పద్ధతి మార్చుకోండి..

స్థానిక వినాయక ఘాట్ వద్ద మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను శనివారం కమిషనర్ పరిశీలించారు. పారిశుద్ధ్య పనులు చేపట్టడంతో పాటు మరమ్మతులు చేయాలని సంబంధిత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజుకు సూచించారు. 'చెబుతున్నవన్నీ నోట్ చేసుకోండి. బుక్ ఉందా.. లేకుంటే అది కూడ తెప్పియాలా.. అని మండి పడ్డారు. ఇంత అధ్వానంగా ఉంటే కనీసం తమ దృష్టికి ఎందుకు తీసుకురాలేదన్నారు. మున్సిపల్ షాపుల కలెక్షన్లపై ఎంత శ్రద్ధ ఉందో రెవెన్యూ సిబ్బంది పనితీరు బట్టే తెలిసిపోతుందన్నారు. ఇకనైన పద్ధతి మార్చుకోండి. అన్ని విభాగాల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆయన వెంట అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఆర్ఓ జునీద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.



కింగ్ మార్కెట్ వద్ద లోపించిన పారిశుద్ధ్యాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ విశ్వనాథ్